సమస్యలుంటే సాక్షికి చెప్పండి

మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి

98490 98674

నంబర్‌ను సంప్రదించండి

క్లుప్తంగా

మానవాళికి ఒక వరం యోగా



యోగాంధ్ర కార్యక్రమంలో పాల్గొని వాలని ర్యాలీ నిర్వహిస్తున్న ప్రజాసంఘాలు

అగనంపూడి: యోగ మానవ జాతికి ఒక వరమని బ్రహ్మకుమారీస్ సంస్థ (దివ్యజ్యోతి భవనం) అగనంపూడి ఇన్‌చార్జి బీకే మకోటి అన్నారు. ఈ నెల 21 యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని 85వ వార్డు పరిధిలోని పలు ప్రాంతాల్లో అవగాహన ర్యాలీ నిర్వహించారు. వయోబేధం లేకుండా అన్ని వయసులు, అన్ని వర్గాలకు చెందిన ప్రజల ఆరోగ్యం కోసం యోగా, ధ్యానం ఆచరించాలన్నారు. యోగాను ప్రపంచ దేశాలు గుర్తించాయన్నారు. కార్యక్రమంలో దిబ్బపాలెం సచివాలయ అడ్మిన్ అమరపిని దిలీప్, నాయకులు బలిరెడ్డి సత్యనారాయణ, కోమల, గంతకోరు అప్పారావు, సురేష్, సమీర్, ఎస్.బాబ్జి, పోలినాయుడు, వసంత కుమార్, పద్మ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్ దృష్టికి టిడ్కో గృహలబ్ధిదారుల సమస్యలు



సమావేశంలో మాట్లాడుతున్న జెడ్సీ శేషాద్రి

గాజువాక: టిడ్కో గృహ లబ్ధిదారుల సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని జీవీఎంసీ గాజువాక జోనల్ కమిషనర్ బి.ఆర్.ఎస్.శేషాద్రి తెలిపారు. గాజువాక జోనల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన టిడ్కో, టాటా ప్రాజెక్ట్స్ గృహ లబ్ధిదారుల సమావేశంలో ఆయన మాట్లాడారు. లబ్ధిదారులు తమకు కేటాయించిన ఇళ్లకు రిజిస్ట్రేషన్లు చేయించుకొని బాకాయిలు చెల్లించాలన్నారు. అంతకుముందు సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి కసిరెడ్డి సత్యనారాయణ మాట్లాడుతూ టిడ్కో గృహ లబ్ధిదారుల సమస్యలను వివరించారు. సమావేశంలో టిడ్కో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సుధాకర్, ఏపీడీలు గంగాధర్, దుర్గా ప్రసాద్, సీపీఐ నాయకులు వనజాక్షి, అచ్యుతరావు తదితరులు పాల్గొన్నారు.

వ్యాక్సిన్‌తో గర్భాశయ క్యాన్సర్ నియంత్రణ



పిల్లలకు వ్యాక్సిన్ వేస్తున్న డాక్టర్ సరోజిని

జగదాంబ: తొమ్మిది నుంచి పద్నాలుగేళ్ల ఆడపిల్లలకు సెర్వారాక్ వ్యాక్సిన్ వేయడం ద్వారా గర్భాశయ క్యాన్సర్‌ను నియంత్రించవచ్చని జిల్లా ఆరోగ్యశాఖ మాజీ అధికారి డాక్టర్ సరోజిని అన్నారు. సోమవారం పాత పోస్టాఫీసు మత్స్యకారుల భవనంలో జర్నలిస్టుల ఆడపిల్లలకు సెర్వారాక్ వ్యాక్సిన్ రెండవ డోస్ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వ్యాక్సిన్ ద్వారా వైరస్‌ను అరికట్టగలమన్నారు. ఈ వ్యాక్సిన్ వేసుకునే ఆడపిల్లలకు ఎటువంటి సైడ్ ఎఫెక్ట్స్ ఉండవని తెలిపారు. తల్లిదండ్రులు భయపడకుండా తమ పిల్లలకు ధైర్యంగా వ్యాక్సిన్ వేయించవచ్చన్నారు. షిరీన్ రెహ్మాన్ ఇటువంటి కార్యక్రమాలు మరిన్ని ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ వుడా చైర్మన్ రెహ్మాన్, షిరీన్ రెహ్మాన్, ఏపీడబ్ల్యుజే జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నారాయణరావు, జి.శ్రీనివాస్, సీనియర్ జర్నలిస్టు జి. వల్లేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

ఆలిండియా డ్రామా పోటీల్లో వాల్తేర్ డివిజన్ ఘనత

తాటిచెట్లపాలెం: బుసావల్‌లో ఈ నెల 6వ తేదీన జరిగిన ఆలిండియా హిందీ డ్రామా పోటీల్లో ఈస్ట్‌కోస్ట్ రైల్వే వాల్తేర్ డివిజన్ మూడో స్థానం కైవసం చేసుకుంది. ఆ వివరాలను వాల్తేర్ డివిజన్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ కె. సందీప్ ఒక ప్రకటనలో తెలిపారు. వీరు ప్రదర్శించిన 'ఆఖే'నాటికకు మూడో బహుమతి లభించింది. ఒక అంధుడు తన జీవితంలో చూపు వచ్చిన తర్వాత ఎలా చెడ్డవాడైపోయాడో వీరు ప్రదర్శించిన నాటిక ద్వారా తెలియజేశారు. సెంట్రల్ రైల్వే జనరల్ మేనేజర్ ధర్మవీర్ మీనా చేతుల మీదుగా ఈ బహుమతి అందుకున్నారు. డీఆర్ఎం లలిత్ బోరా బృంద సభ్యులను అభినందించారు.

అగనంపూడి టోల్‌ప్లాజా కథ కంచికి చేరిందని సంబరపడుతున్న వాహనచోదకులకు త్వరలో ఎన్‌హెచ్ఏఐ షాక్ ఇవ్వనుంది. టోల్‌ప్లాజా మళ్లీ ఏర్పాటు చేయడానికి సన్నాహాలు జరుగుతున్నాయి. బంగారు బాతు లాంటి అగనంపూడి టోల్‌ప్లాజాను వదులు కోవడానికి ఎన్‌హెచ్ఏఐ అధికారులు, కాంట్రాక్టర్లు ఇష్టపడడం లేదు. ఏడాది కిందట కూటమి నాయకులు బలవంతంగా తొలగించిన అగనంపూడి టోల్ ప్లాజాను మళ్లీ ప్రారంభించడానికి పనులు చకచకా చేస్తున్నారు. ఇది చూసిన వారు విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ప్రైవేటీకరణ చేయడానికి నష్టాల కట్టుకథ అల్లినట్టే టోల్‌ప్లాజా మళ్లీ తెరిచేందుకు రంగం సిద్ధమైంది. – అగనంపూడి

దారి దోపిడీకి సన్నాహాలు!



సీసీ కాంక్రీట్ పనులకు వీలుగా రోడ్డు తవ్విన దృశ్యం

- అగనంపూడి టోల్‌ప్లాజా పునః ప్రారంభానికి చకచకా పనులు
- ఏడాది కిందట తొలగించిన అధికార పార్టీ నాయకులు
- మళ్లీ వాహనచోదకుల జేబులకు చిల్లు పెట్టేందుకు యత్నాలు
- టోల్‌గేటు వద్ద కాంక్రీట్ ప్లాట్‌ఫారాల నిర్మాణం పూర్తి
- సమాధానం చెప్పడానికి నిరాకరించిన ఎన్‌హెచ్ఏఐ పీడీ



అగనంపూడి టోల్‌గేటు వద్ద నిర్మిస్తున్న సీసీ ప్లాట్‌ఫారాలు

అసలు కథలోకి వెళ్తే...

ఇసుకతోట నుంచి అనకాపల్లి వరకు జాతీయ రహదారి విస్తరణకు జాతీయ రహదారుల సంస్థ ఐడీబీఐ నుంచి 1995లో రూ.63.54 కోట్ల నిర్మాణ వ్యయాన్ని అప్పుగా స్వీకరించింది. రహదారి విస్తరణ పనులు పూర్తవడంతో అనంపూడిలో టోల్ ప్లాజా ఏర్పాటు చేసి ఆర్అండ్‌బీ కొద్ది నెలలపాటు టోల్‌ఫీజు ఫీజు వసూలు చేసింది. తర్వాత ఆ బాధ్యతను ఎన్‌హెచ్ సంస్థ స్వీకరించింది. విచిత్రమేంటంటే అప్పు ఎన్ని వాయిదాలు చెల్లించాలి? ఎంత శాతం వడ్డీ? ఏమేరకు అప్పు తీరిందనేది భేతాళ ప్రశ్నగానే నేటికీ మారింది. ఆర్టీఐలో సమాచారం ఇవ్వడానికి అధికారులు నిరాకరించడంతో దోపిడీలో పెద్దల హస్తం ఉందని బహిర్గతం అవుతోంది.

27 ఏళ్లు వసూలు చేసినా..

సుమారు 27 ఏళ్ల పాటు టోల్‌ఫీజు వసూలు నిరాటంకంగా కొనసాగింది. కరోనా సమయంలో కూడా వసూలు పర్వాన్ని ఆపలేదు. ఆదాయ వివరాలను సమాచార హక్కు చట్టం ద్వారా 2017లో రాబట్టగా, రూ.205.62 కోట్లు సమకూరినట్టు అధికారులే వెల్లడించారు. 2021లో పార్లమెంట్‌లో రాష్ట్రానికి చెందిన ఎంపీ ఇదే అంశాన్ని లేవనెత్తగా రవాణాశాఖ అధికారులు పచ్చి అబద్ధాలు వల్లె వేశారు. కేవలం రూ.20 కోట్లు మాత్రమే ఆదాయం సమకూరిందని భారత పార్లమెంట్‌లో బుకాయించారు. ఈ క్రమంలో 2018లో గాజువాకకు చెందిన న్యాయవాది రాష్ట్ర ఉన్నత న్యాయస్థానంలో పిల్ వేయగా హైకోర్టు అగనంపూడి టోల్‌ప్లాజాను మూసివేయాలని ఆదేశించింది. దీంతో వాహన దారులు, నిత్య ప్రయాణికులు నెలరోజుల పాటు కూడా సంతోషపడకుండానే ఎన్‌హెచ్ఏఐ అధికారుల సహకారంతో కాంట్రాక్టర్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు.

మభ్యపెట్టి..

కోర్టును మభ్యపెట్టిన కాంట్రాక్టర్ న్యాయస్థానం ద్వారా మళ్లీ టోల్‌గేటు ప్రారంభించారు. ఐదేళ్లపాటు టోల్‌దోపిడీ కొనసాగించగా, 2024 జూన్‌లో అధికార పార్టీకి చెందిన నాయకులు టోల్ ప్లాజాను బలవంతంగా తొలగించారు. దీంతో వెనక్కి తగ్గారని, టోల్‌ప్లాజా ఉండబోదని సంబర పడ్డారు. ఐతే న్యాయ స్థానంలో కేసు ఉండగా తొలగించడం అన్యాయమని కాంట్రాక్టర్, ఎన్‌హెచ్ఏఐ అధికారులు కోర్టుకు వెళ్లారు. ఆరంభం నుంచి ఇప్పటి వరకు సమకూరిన ఆదాయ వివరాలు తమకు అందించాలని న్యాయస్థానం ఎన్‌హెచ్ఏఐ అధికారులను ఆదేశించింది. ఈవిషయంలో కౌంటర్ వేయకుండా, లెక్కలు వెల్లడించకుండానే రెండున్నర నెలల నుంచి టోల్‌ప్లాజా పునః ప్రారంభానికి సన్నద్ధమవుతున్నారు. సీసీ కాంక్రీట్‌తో అడుగు ఎత్తులో ప్లాట్‌ఫారాలు నిర్మిస్తుంది. నిర్మాణ పనులు ముమ్మరంగా కొనసాగిస్తుండడంతో త్వరలో టోల్‌దోపిడీ ప్రారంభం కానున్నందే ఆందోళనలో స్థానికులు ఉన్నారు. ఇదే విషయమై ఎన్‌హెచ్ఏఐ పీడీని వివరణ అడగడానికి ప్రయత్నించగా విషయం అర్థం కానట్టు, ఫోన్ వినపడనట్టు పలు మార్లు ఫోన్ కట్ చేసి తప్పించుకున్నారు.

ఆరంభ శూరత్వం



ఉక్కు కర్మాగారం విషయంలో కూటమి ప్రభుత్వం ప్రగల్భాలు పలికింది. టోల్‌గేటు విషయంలో అదే తీరు కనబర్చారు. తర్వాత వీటి విషయాన్ని వదిలేశారు. ఉక్కు కర్మాగారం విషయంలో కేంద్రంతో లాలూచీ పడినట్టే ఇప్పుడు కూడా కేంద్ర పెద్దల ఒత్తిడితో స్థానిక పాలకులు మెత్తబడినట్టు కనపడుతోంది.న్యాయస్థానంలో కాంట్రాక్టర్ల, అధికారుల వాదనను తిప్పికొట్టకపోతే రాజమార్గంలో మళ్లీ వాహనచోదకులు తోలు వలిచేయడం ఖాయం. అంతా భారాన్ని మోయాల్సి వస్తుంది.

– పట్టా రామ అప్పారావు, వినియోగదారుల హక్కు వేదిక కన్వీనర్

వెయ్యి కోట్లకు పైగా వసూలు



సుమారు 27 ఏళ్ల పాటు వెయ్యి కోట్లకు పైగా వసూలు చేసి కాంట్రాక్టర్లు, అధికారులు, పాలకులు జేబులు నింపుకున్నారు. అధికారిక లెక్కల ప్రకారం రూ.400 కోట్లకు పైగా హైవే అథారిటీ ఖాతాలో జమ అయింది. అయినా దాహం తీరక పోవడం దారుణం. ఇప్పటికైనా పాలకులు గట్టిగా నిలబడకపోతే గాజువాక జోన్ పరిధిలోని ప్రజలు కోట్ల రూపాయల ఆర్థిక భారం మోయాల్సి వస్తుంది.

– జి.పూర్ణానందశర్మ (పూర్ణ) అగనంపూడి

సామాన్యులపై భారం



ప్రతీ ఏటా 25శాతం నుంచి 30 శాతం ఫీజు పెంచుకుంటూ పోతున్నారు. దీంతో సొంత వాహనదారులతోపాటు సిటీ బస్సుల్లో ప్రైవేటు, ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం చేసే ప్రయాణికులు దూరాన్ని బట్టి కనీసం రూ.10 వరకూ అదనంగా చెల్లించాల్సి వస్తుంది. ఇప్పుడు మళ్లీ టోల్‌ప్లాజా ప్రారంభిస్తే సామాన్యుల నుంచి తిరుగుబాటు తప్పదు.

– ఎం.మస్తాన్‌రెడ్డి, పెదమడక

సేవలే గుర్తింపు తెస్తాయి



పదవీ విరమణ పొందిన ఉద్యోగులను సత్కరిస్తున్న సీఐ మల్లేశ్వరరావు

కూర్మన్నపాలెం: ప్రభుత్వ ఉద్యోగులకు వారు చేసిన సేవలే గుర్తింపు తీసుకు వస్తాయని దువ్వాడ సీఐ కె. మల్లేశ్వరరావు పేర్కొన్నారు. అందువల్లే ప్రతి ఒక్కరూ అంకితభావంతో పనిచేసి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలన్నారు. తద్వారా వారి మన్ననలు అందుకోవాలన్నారు. దువ్వాడ పోలీసుస్టేషన్‌లో పదవీ విరమణ పొందిన హెడ్‌కానిస్టేబుల్ వరహాలరాజు, హోమ్‌గార్డు రత్నకుమార్‌కు ఆయన శాలువా కప్పి సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వరహాలరాజు, రత్నకుమార్ విధినిర్వహణలో మెరుగైన సేవలు అందించారని.. మిగిలిన శేషజీవితాన్ని ఆనందంగా గడపాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎస్ఐలు డి. శ్రీనివాసరావు,ఎల్. శ్రీనివాసరావు, సిబ్బంది వారి కుటుంబసభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్టేషన్ సిబ్బంది సమకూర్చిన రూ. 30 వేలు వారికి సీఐ అందజేశారు.

పోలీసుల అదుపులో గంజాయి నిందితులు

తాటిచెట్లపాలెం: విశాఖ మీదుగా అక్రమంగా గంజాయి రవాణా చేస్తున్న నిందితులను రైల్వే పోలీసులు సోమవారం అదుపులోకి తీసుకున్నారు. జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ ధనుంజయనాయుడు ఆధ్వర్యంలో ఎస్ఐ కె. శాంతారావు, ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ కె. రామకృష్ణ తమ సిబ్బందితో రైల్వేస్టేషన్‌లోని ప్లాట్‌ఫాంలలో విస్తృత తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలలో తెలంగాణ రాష్ట్రం, నిజామాబాద్ జిల్లాకు చెందిన పెలియ రామ్‌సింగ్, కామారెడ్డి జిల్లాకు చెందిన బస్సి మురారీ ఒడిశా రాష్ట్రం మాచ్‌ఖండ్ నుండి సికింద్రాబాద్‌కు అక్రమంగా రవాణా చేస్తున్న సుమారు రూ. 68,950 విలువ గల 13.79 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నిందితులను జీఆర్పీ సిబ్బందికి అప్పగించారు. జీఆర్పీ సిబ్బంది నిందితులను రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరుపరిచినట్లు తెలిపారు.

డంపింగ్ యార్డ్ తరలించాలని ధర్నా



డంపింగ్ యార్డ్ గేటు వద్ద ధర్నా చేస్తున్న పలు కాలనీల వాసులు, స్థానిక నాయకులు

పెదగంట్యాడ: జీవీఎంసీ 76వ వార్డు పరిధిలోని రామచంద్రనగర్ ఎస్టీ కాలనీకి ఆనుకొని ఉన్న డంపింగ్ యార్డ్‌ను తరలించాలని స్థానికులు డిమాండ్ చేశారు. డంపింగ్ పోరాట కమిటీ ఆధ్వర్యంలో డంపింగ్ యార్డ్ ఎదుట సోమవారం 16 గ్రామాలకు చెందిన నాయకులు, ప్రజలు ఆందోళనకు దిగారు. ఈ మేరకు డంపింగ్ యార్డ్ గేటు వద్ద ధర్నా చేశారు. కార్పొరేటర్లు గంధం శ్రీనివాసరావు, బి. గంగారావు, 76వ వార్డు వైఎస్సార్‌సీపీ నాయకుడు మంత్రి శంకరనారాయణ, సీపీఎం కార్యదర్శి ఎం.రాంబాబు,నాయకులు రౌతు గోవింద్ మాట్లాడుతూ డంపింగ్ యార్డ్‌కు ప్రతి రోజూ టన్నుల కొద్దీ చెత్త వస్తుందని, దీనిని ఇక్కడే నిల్వ చేయడంతో దుర్వాసన వస్తోందన్నారు. 15 ఏళ్లుగా ఇబ్బందులు పడడమే కాకుండా వ్యాధుల కారణంగా అవస్థలు పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. డంపింగ్ యార్డ్‌ను తరలించాలని పలుమార్లు ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఇప్పటికైనా తరలించకపోతే ఆందోళన ఉధృతం చేస్తామనిహెచ్చరించారు. కార్యక్రమంలో రామచంద్రనగర్, రిక్షా కాలనీ, గాంధీనగర్, బర్మా కాలనీ, స్వతంత్రనగర్, ఎస్టీ కాలనీ, గోపాలరెడ్డినగర్, భరత్‌నగర్, శీరవాని పాలెం, నడుపూరుకు చెందిన అధ్యక్షులు, ప్రజలు పాల్గొన్నారు.

రెండు మొబైల్ చోరీ కేసుల ఛేదన

అక్కిరెడ్డిపాలెం: రెండు మొబైల్ చోరీ కేసులను గాజువాక క్రైం పోలీసులు ఛేదించారు. గాజువాక క్రైం ఎస్ఐ మన్మథరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గాజువాకకు చెందిన షేక్ బాబా అనే వ్యక్తి విమానాశ్రయంలో లగేజ్ లోడ్ చేస్తాడు. ఇతను ఈ నెల 2న ఇంటికి వెళ్తుండగా ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు ద్విచక్ర వాహనంపై వచ్చి అతని నుంచి మొబైల్ లాక్కొని పారిపోయారు. దీంతో షేక్ బాబా 4న గాజువాక క్రైం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. అలాగే 2వ తేదీ మధ్యాహ్నం బుగత రమణ అనే లారీ డ్రైవర్‌ను చినగంట్యాడ జంక్షన్ వద్ద ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు బెదిరించి రూ.8 వేలు విలువైన ఫోన్ లాక్కొని పారిపోగా మరుసటి రోజు గాజువాక క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో క్రైం ఏడీసీపీ మోహనరావు పర్యవేక్షణలో జోన్ 2 క్రైం ఏసీపీ డి.లక్ష్మణరావు, సౌత్ సబ్‌డివిజన్ ఇన్‌స్పెక్టర్ కె.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఎస్ఐ ఎ.మన్మథరావుతో కూడిన ప్రత్యేక బృందం సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి నిందితులను ఈ నెల 7వ తేదీన కాకతీయ ఆర్చ్ వద్ద పట్టుకున్నారు. రిమాండ్ నిమిత్తం సోమవారం కోర్టులో హాజరుపర్చారు. నిందితుల్లో భానోజీతోటకు చెందిన రాజన్‌కుమార్ మోహతా , పెదగంట్యాడ, అశోక్‌నగర్‌కు చెందిన మల్లిడి దుర్గాప్రసాద్, బీసీ రోడ్డు, భానోజీతోట దుర్గాదేవి గుడి వద్ద నివాసం వుంటున్న రవి సింగ్ ఉన్నట్టు తెలిపారు. వారి నుంచి మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.

డాక్టర్ మహేశ్వరరెడ్డికి సత్కారం



డాక్టర్ మహేశ్వరరెడ్డిని సత్కరిస్తున్న ఎంపీ బాబూరావు, ఎమ్మెల్సీ కల్యాణి, కేకే రాజు

పెదగంట్యాడ: ఇటీవల డాక్టరేట్ పొందిన గొందేశి మహేశ్వరరెడ్డిని రాజ్యసభ సభ్యుడు గొల్ల బాబూరావు, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, వైఎస్సార్‌సీపీ విశాఖ జిల్లా అధ్యక్షుడు కేకే రాజు, మాజీ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, వైఎస్సార్‌సీపీ గాజువాక నియోజకవర్గ సమన్వయకర్త తిప్పల దేవన్‌రెడ్డి ఆదివారం రాత్రి సత్కరించారు. సామాజిక సేవారంగంలో అపార సేవలందిస్తున్న మహేశ్వరరెడ్డి కృషిని గుర్తించి ఇంటర్నేషనల్ గ్లోబల్ పీస్ యూనివర్సిటీ ప్రతినిధులు ఇటీవల ఢిల్లీలో డాక్టరేట్ ప్రదానం చేశారు. ఈ మేరకు ఆయనకు ఆదివారం రాత్రి అగ్నికుల క్షత్రియ కల్యాణ మండపంలో ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేసి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాజమండ్రి పరిశీలకుడు తిప్పల గురుమూర్తిరెడ్డి, నాయకులు మంత్రి రాజశేఖర్, తిప్పల నితీష్‌రెడ్డి, గొందేశి పెదరెడ్డి,గొందేశి సుమన్‌రెడ్డి, జీలకర్ర నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

సేవ చేయడం అదృష్టం



కార్యక్రమంలో పాల్గొన్న ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ వెంకటరమణ,నిర్వాహకులు

అగనంపూడి: సేవ చేయాలనే ఆలోచన ఉన్నా చేసే అవకాశం కొద్ది మందికే వస్తుందని దువ్వాడ ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ బుడుమూరు వెంకటరమణ అన్నారు. దువ్వాడ రైల్వేస్టేషన్‌లో ఐదు వారాల్లో పదివేల మినరల్ వాటర్ బాటిళ్లను ప్రయాణికులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సేవా సంస్థలు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ మండుటెండను సైతం లెక్క చేయకుండా వృద్ధులు, బాలలు, విశ్రాంత ఉద్యోగులు సాధారణ రైలు ప్రయాణికులకు మినరల్ వాటర్ బాటిళ్లు అందివ్వడం సంతోషంగా ఉందన్నారు. దువ్వాడ రైల్వేస్టేషన్‌ను అభివృద్ధి చేయాలనే సంకల్పం ఇక్కడి ప్రజల్లో మెండుగా ఉందని, రానున్న రోజుల్లో దువ్వాడ రైల్వేస్టేషన్ ఆదర్శ రైల్వే స్టేషన్‌గా చూడబోతున్నామన్నారు. స్థానికుల సహకారం ఉంటే అధికారులకు విధులు నిర్వహించడం సులభం అనేది ఇక్కడి సంస్థలు నిరూపిస్తున్నాయన్నారు. దువ్వాడ కన్సల్టెన్సీకమిటీ సభ్యుడు కె.ఈశ్వర్, మానవ వికాస వేదిక అధ్యక్షుడు ఎం.ఎస్.ఎన్.మూర్తి మాట్లాడుతూ సేవా కార్యక్రమాలు చేసేందుకు అనుమతినిచ్చిన అధికారులు, ఆర్పీఎఫ్ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో దువ్వాడ రైల్వేయూజర్స్ అసోసియేషన్, మానవ వికాస వేదిక, మానవతా, లయన్స్‌క్లబ్, స్పందన చేయూత, లయన్స్‌క్లబ్ అగనంపూడి, స్టీల్‌సిటీ, కూర్మన్నపాలెం, సాయి సేవా సమితి, సర్వహిత చారిటబుల్ ట్రస్ట్, అగనంపూడి సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్, ఐ స్టాండ్‌ఫర్ ది నేషన్, స్టీల్ ఎగ్జిక్యూటివ్ అసోసియేషన్,, విశ్వ హిందూ పరిషత్ ప్రతినిధులు పాల్గొన్నారు.

'మత్స్యకారులు' పుస్తకావిష్కరణ



మత్స్యకారులు పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వాసుపల్లి గణేష్‌కుమార్ తదితరులు

డాబాగార్డెన్స్: సముద్రంలో ఉప్పొంగే కెరటాల మాదిరి తమ మత్స్యకారులు ఆటుపోట్లను ఎదుర్కొంటున్నారని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త వాసుపల్లి గణేష్‌కుమార్ పేర్కొన్నారు. పిక్కి కోదండరావు రచించిన 'మత్స్యకారులు' పుస్తకాన్ని వాసుపల్లి సోమవారం ఆశీల్‌మెట్ట సమీపాన తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత్స్యకారుల గురించి క్లుప్తంగా రాసిన కోదండరావుకు, పశ్చిమ గోదావరి జిల్లా తణుకు అంబేడ్కర్ సాహిత్య అకాడమీ గ్రహీత మురాల నవీన్‌కుమార్‌కు అభినందనలు తెలిపారు. పుట్టుక-వికాసం-అభివృద్ధి అంశాలపై వారు పడుతున్న ఆవేదన, జీవన శైలిపై పుస్తక రూపంలో విడుదల చేయడం అభినందనీయమన్నారు. మత్స్యకారుల కష్టాన్ని, అనుభవించే ఆనంద క్షణాలను కూడా అక్షర రూపంలో చూపించారన్నారు. ఈ గ్రంథం ఒక కులం చరిత్రను ఎత్తి చూపడం కాదన్నారు. వారి కన్నీటి గాథల్ని మనం మరచిపోలేని విధంగా అందించారని వాసుపల్లి తెలిపారు. మత్స్యకారులంటే కేవలం సముద్రంలో వేటకు మాత్రమే పరిమితం కాకుండా ఎన్నో అద్భుతాలు సృష్టించిన వారిలో వారు కూడా ప్రముఖ పాత్ర పోషించారన్నారు. మత్స్యకారుల పిల్లల భవిష్యత్ మెరుగుపడాలని, వారు ఉన్నత విద్య అభ్యసించి, తలరాతలు మార్చుకునే విధంగా ఎదగాలన్నారు. కార్యక్రమంలో పార్టీ బీసీ సెల్ అధ్యక్షుడు సనపల రవీంద్రభరత్ తదితరులు పాల్గొన్నారు.

కొట్టుకొచ్చిన గుర్తు తెలియని మృతదేహం



మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

అల్లిపురం: మహారాణిపేట పోలీస్ స్టేషన్ పరిధి, గోకుల్ పార్కు వద్దకు సోమవారం ఉదయం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం కొట్టుకొచ్చింది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతుడు సుమారు 50 సంవత్సరాలు వయస్సు కలిగి, బ్లాక్ టీషర్టు, బ్లాక్ కలర్ నిక్కరు వేసుకుని ఉన్నాడని తెలిపారు. మృతదేహాన్ని మార్చురీలో భద్రపరిచినట్లు చెప్పారు.

స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్ట్ కార్మికుల తొలగింపు ఆపాలి



రాస్తారోకో చేస్తున్న సీపీఎం నాయకులు

తగరపువలస: విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో 3,100 మంది కాంట్రాక్ట్ కార్మికుల తొలగింపును నిరసిస్తూ, వారిని వెంటనే విధుల్లోకి తీసుకోవాలని కోరుతూ భీమిలి డివిజన్ సీపీఎం నాయకులు సోమవారం రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా భీమిలి జోన్ కార్యదర్శి ఆర్ఎస్ఎన్ మూర్తి మాట్లాడుతూ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా నాలుగున్నరేళ్లుగా కార్మిక, ప్రజా సంఘాలు పెద్ద ఎత్తున పోరాటాలు చేస్తున్నాయని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు తీసుకొచ్చిన ప్యాకేజీ కర్ణాటక స్టీల్‌ప్లాంట్ కంటే తక్కువన్నారు. వీఆర్ఎస్ పేరుతో 1,200 మంది పర్మినెంట్ కార్మికులను ఇంటికి పంపారన్నారు. కేంద్ర ప్రభుత్వం రూ.19.34 లక్షల కోట్లు మొండి బకాయిలు కార్పొరేట్ సంస్థలు, పెట్టుబడిదారులకు రద్దు చేసిందని చెప్పారు. తొలగించిన కార్మికులకు వెంటనే విధుల్లోకి తీసుకుని ప్రైవేటీకరణ మానుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పంపాన సూర్యనారాయణ, పెంట రాజు, చిన్నారావు, రాము, ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

బాలకార్మిక వ్యతిరేక మాసం పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న జేసీఎల్ రామారావు

సీతంపేట: అంతర్జాతీయ బాలకార్మిక వ్యతిరేక మాసం సందర్భంగా కార్మిక శాఖ, ఆంధ్రప్రదేశ్ ప్రో చైల్డ్ గ్రూప్, విశాఖ ఫోరం ఫర్ చైల్డ్ రైట్స్ ఆధ్వర్యంలో జాయింట్ లేబర్ కమిషనర్ ఎం.రామారావు, డిప్యూటీ లేబర్ కమిషనర్ ఎం.సునీత అక్కయ్యపాలెంలోని కార్మిక శాఖ కార్యాలయంలో ప్రచార పోస్టర్లు ఆవిష్కరించారు. బాలలు పనిచేసే వాతావరణాన్ని కాదు, చదువుకునే వాతావరణాన్ని సృష్టిద్దాం, పురోగతి స్పష్టంగా కనిపిస్తోంది, కానీ ఇంకా చేయవలసింది ఉంది, మన ప్రయత్నాలు వేగవంతం చేద్దాం అనే నినాదంతో పోస్టర్లు రూపొందించారు. ఈ పోస్టర్లు నగరంలో పలు ప్రాంతాలలో ప్రదర్శించి బాల కార్మిక వ్యవస్థకు వ్యతిరేకంగా ప్రజలకు అవగాహన కల్పించాలని లేబర్ కమిషనర్ రామారావు సిబ్బందిని కోరారు. ఈ కార్యక్రమంలో విశాఖ ఫోరం ఫర్ చైల్డ్ రైట్స్ కార్యదర్శి బి. హరి, పలు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్లు పాల్గొన్నారు.